క్లుప్తంగా

సబ్‌జైలు పరిశీలన



తెనాలిరూరల్: స్థానిక సబ్ జైలును రెండో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ జె. శ్రీసీత శనివారం సాయంత్రం పరిశీలించారు. జైలు ఆవరణను పరిశీలించి ఖైదీల వసతుల గురించి ఆరా తీశారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారం, తాగు నీటిని పరిశీలించారు. అనంతరం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఖైదీలతో మాట్లాడారు. క్షణికావేశంలో చేసిన తప్పుల వల్ల జైలుపాలు కావాల్సి వచ్చి ఉంటుందని, ఇకనైనా మారి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. తాగునీరు, ఫాగింగ్ విషయమై జైలు సిబ్బందికి సూచనలు చేశారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, ప్యానల్ న్యాయవాది షేక్ ఖాదర్ హుస్సేన్, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది మహబూబ్. విజయ్, పీఎల్‌వీ యర్రంశెట్టి అనిల్‌కుమార్ న్యాయమూర్తితో ఉన్నారు.

కంచర్లపాలెం దేవస్థానంలో ఎమ్మెల్యే పూజలు



తెనాలిటౌన్: రూరల్ మండలం కంచర్లపాలెం గ్రామంలో వేంచేసియున్న జడలమ్మ తల్లి దేవస్థానం కొలుపులు శనివారం జరిగాయి. దేవస్థానంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొల్లినేని బుజ్జి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు సంగీత కళాకారుడి వర్ధంతి సభ

తెనాలిఅర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి తెనాలి వారి ఆధ్వర్యంలో సంగీత కళాకారుడు రోజాబాబు మూడోవ వర్ధంతి సభను గాంధీనగర్‌లోని బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్ హాల్‌లో ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి దేవరపల్లి నీలాంబరం ఒక ప్రకటనలో తెలిపారు. కళాకారులు పాల్గొనాలని కోరారు.

లోఓల్టేజీ సమస్యకు పరిష్కారం



తెనాలిఅర్బన్: మూడోవ వార్డు గడ్డిపాటి వారి వీధిలో నెలకొన్న లోఓల్టేజీ సమస్యకు పరిష్కారం దొరికింది. ఈ ప్రాంతంలో విద్యుత్ అధికారులు నూతనంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. లోఓల్టేజీ సమస్యతో ఆ ప్రాంతవాసులు ఇబ్బంది పడుతుండటాన్ని ఎమ్మెల్యే శివకుమార్ దృష్టికి స్థానిక కౌన్సిలర్ ఆవుల కోటయ్య తీసుకువెళ్ళారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు విద్యుత్‌శాఖ అధికారులు ఈ ప్రాంతంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి శనివారం ఆరంభించారు.

నేడు తెనాలికి డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే

తెనాలిరూరల్: ప్రముఖ గుండె వైద్య నిపుణులు, కార్డియో థొరాసిక్ సర్జన్ పద్మశ్రీ డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే ఆదివారం తెనాలి రానున్నారు. పట్టణ బోస్‌రోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ కార్యాలయంలో రాత్రి జరగనున్న సభలో 'మినిమల్లీ ఇన్‌వేసివ్ కార్డియాక్ సర్జరీ' అన్న అంశంపై ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపాలకృష్ణ గోఖలేకు డాక్టర్ పి. దక్షిణామూర్తి ధార్మిక బంగారు పతకం ప్రదానం చేస్తారు. గుండె ఊపిరితిత్తుల మార్పిడి స్పెషలిస్ట్ అయిన డాక్టర్ ఓఖలే 16 వేలకు పైగా ఓపెన్ హార్ట్ సర్జరీలు, 48 గుండె మార్పిడి శస్త్ర చికిత్సలు చేశారు. ఐఎంఏ సభలో పాల్గొనేముందు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, వాకర్స్ క్లబ్, చైతన్య వేదిక సంస్థల ఆధ్వర్యంలో కవిరాజ పార్కులోని సీనియర్ సిటిజన్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన సభలో డాక్టర్ కాసరనేని సదాశివరావు స్మారకోపన్యాసంలో డాక్టర్ గోఖలే ప్రసంగిస్తారు. విజ్ఞాన్ అధినేత డాక్టర్ లావు రత్తయ్య ముఖ్య అతిథిగా పాల్గొంటారని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు జి. వెంకటరత్నం తెలిపారు.

జెడ్పీ హైస్కూల్లో ఎన్‌సీసీ

తెనాలిఅర్బన్: మండల పరిధిలోని నందివెలుగులోగల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్‌సీసీ విభాగాన్ని 22 ఆంధ్ర బెటాలియన్ అధికారి సుబేదార్ మేజర్ మనోజ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. అనంతరం ఎన్‌సీసీ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. ఎన్‌సీసీలో చేరడం వలన శారీరక దృఢత్వం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జి.శివపార్వతి, కల్నల్ ఉమాశంకర్, ఎన్‌సీసీ అధికారులు కె.నాగశిరీష, ఎస్ఎంసీ చైర్మన్ ఎంవీడీ రామకృష్ణ పాల్గొన్నారు.

సలహాదారు రామకృష్ణారెడ్డికి ఘనస్వాగతం

నందివెలుగు సెంటర్‌లో స్వాగతం పలికిన ఎమ్మెల్యే శివకుమార్



గజమాలతో సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డికి స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

తెనాలిటౌన్: పట్టణంలో పుస్తకావిష్కరణ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి శనివారం నందివెలుగు సెంటర్‌లో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. పాదినా ఆకులతో తయారు చేసిన భారీ గజమాలను క్రేన్ సహాయంతో సజ్జల రామకృష్ణారెడ్డికి వేశారు. పలువురు నాయకులు పుష్పగుచ్ఛాలు, బొకే, దండలతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం బైక్ ర్యాలీతో వెళ్లారు. నందివెలుగు నుంచి తెనాలి వరకు ర్యాలీ నిర్వహించారు. మొదటిసారిగా రామకృష్ణారెడ్డి తెనాలి రావడంతో నాయకులు, అధిక సంఖ్యలో స్వాగతం పలికేందుకు తరలివచ్చారు. నందివెలుగు జాషువానగర్ వద్ద బెజ్జం బాజి మిత్రమండలి సభ్యులు, కంచర్లపాలెం వద్ద కోపల్లె సురేష్, సోమసుందరపాలెం వద్ద ఎంపీటీసీ సభ్యులు ధర్మరాజుల చెన్నకేశవులు, కఠెవరం వద్ద జడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి, నాయకులు మైలాభాను ప్రసాద్, సంకురు బుజ్జిబాబు, ఆదం షఫీ తదితరులు రామకృష్ణా రెడ్డికి ఘనస్వాగతం పలికారు. నందివెలుగు వద్ద ఎమ్మెల్యే శివకుమార్‌తో పాటు కౌన్సిలర్ గెద్దేటి సురేంద్ర, బూరెల దుర్గాప్రసాద్, మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, అవుతు సీత నగేష్‌రెడ్డి, బొంతు నరేంద్రరెడ్డి, ఆరిగ చంద్రారెడ్డి, ప్రసాదం బాలగురవమ్మ, కొలకలూరి నాగేశ్వరరావు, అత్తోట చంటి, తాడిబోయిన రమేష్, అక్కిదాసు కిరణ్, తాడిబోయిన రామయ్య, అత్తోట చంటి, మేకల రవి, కఠారి హరీష్, మన్నవ ప్రభాకర్, పినపాటి అనిల్, షేక్ దుబాయ్‌బాబు, మొగల్ అహ్మద్, బొమ్ము నాగిరెడ్డి, సిలార్ జానీ, కుక్కల వాసు, పేరం సంజీవరెడ్డి, కాకి దేవసహాయం, పెసర్లంక రమణ, గుంటూరు కోటేశ్వరరావు, సిరికృష్ణ, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, తోటకూర వసంతరావు, బొల్లిముంత పోతురాజు, చెక్కా సీతమ్మ, దూళ్ళిపాళ్ళ దుర్గాప్రసాద్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బహుజన కవిత్వం రాకతో సాహిత్యంలో మార్పులు



మాట్లాడుతున్న లక్ష్మీనరసయ్య, వేదికపై కృపాచారి, రత్నాకర్, సునీత, కృపాకర్ మాదిగ

తెనాలిరూరల్: బహుజన కవిత్వం రాకతో సాహిత్యంలో మార్పులు వచ్చాయని ప్రముఖ సాహితీ విమర్శకులు గుంటూరు లక్ష్మీనరసయ్య తెలిపారు. పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక సంస్థ భిన్న స్వరాలు ఆధ్వర్యంలో ఏడాదిపాటు నిర్వహించతలపెట్టిన ప్రతి నెల ఒక మంచి పుస్తకంపై చర్చ కార్యక్రమాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. స్థానిక నందులపేట కవిరాజ పార్కులోని సీనియర్ సిటిజన్స్ హాలులో జరిగిన కార్యక్రమంలో దళిత కవి, ఉద్యమకారుడు కృపాకర్ మాదిగ రచించిన మాదిగ కవితా సంకలనం 'పంచుకుందాం రా' పుస్తకంపై చర్చ జరిపారు. కార్యక్రమానికి భిన్న స్వరాలు సంస్థ నిర్వాహకులు నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ దళితులందరూ ఏకమై వారికి ఉన్న వనరులను, సాంస్కృతీ సంప్రదాయాలను, రాజ్యాంగ హక్కులను పంచుకుందాం అన్న సారంశంతో కృపాకర్ మాదిగ రచించించడం అభినందనీయమన్నారు. బహుజనేతర కులాలైన అగ్రవర్ణాల్లోని పేదలు, పీడితులు ఏకమవ్వాల్సిన అవసరం ఉందన్నారు. దళిత ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి మాట్లాడుతూ 'పంచుకుందాం రా' పుస్తకంలోని కవితలను వివరిస్తూ సాహితీ ప్రయోగాలను వర్ణించారు. నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆచార్య పొన్నెకంటి రత్నాకర్, కవయిత్రి, కథా రచయిత్రి గంగవరపు సునీత మాట్లాడారు. 'పంచుకుందాం రా' రచయిత కృపాకర్ మాదిగను అతిథులు అభినందించి సత్కరించారు.

జెడ్పీ హైస్కూల్లో ఎన్‌సీసీ విభాగం

తెనాలిఅర్బన్: మండల పరిధిలోని నందివెలుగులోగల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్‌సీసీ విభాగాన్ని 22 ఆంధ్ర బెటాలియన్ అధికారి సుబేదార్ మేజర్ మనోజ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. అనంతరం ఎన్‌సీసీ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. ఎన్‌సీసీలో చేరడం వలన శారీరక దృఢత్వం లభిస్తుందన్నారు. అలాగే వివిధ ఎన్‌సీసీ సర్టిఫికెట్లు సాధించిన వారికి ఉద్యోగాల ఎంపికల్లో ప్రాధాన్యత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జి.శివపార్వతి, కల్నల్ ఉమాశంకర్, ఎన్‌సీసీ అధికారులు కె.నాగశిరీష, ఎస్ఎంసీ చైర్మన్ ఎంవీడీ రామకృష్ణ పాల్గొన్నారు.

29న కొల్లూరు మండల పరిషత్తు సమావేశం

కొల్లూరు: మండల ప్రజా పరిషత్తు సర్వసభ్య సమావేశం ఈ నెల 29న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ అధ్యక్షతన జరగనున్న సమావేశంలో ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్షా సమావేశం, తీర్మానాలు ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా తమ శాఖల ప్రగతి నివేదికలతో హాజరుకావాలని తెలిపారు.

స్థాయి మరచి విమర్శించ వద్దు

భట్టిప్రోలు: స్థాయిని మరచి టీడీపీ నేత సాయిబాబా ముఖ్యమంత్రిని, మంత్రిని విమర్శించడం తగదని ఎంపీపీ, జెడ్పీటీసీలు దావూరి వెంకట లలితకుమారి, టి.ఉదయభాస్కరి హితవు పలికారు. శనివారం విలేకరులతో వారు మాట్లాడుతూ.. వేమూరులో జరిగిన పార్టీ సమీక్షా సమావేశంలో మండలానికి నాలుగు వేల ఓట్లు తొలగించే విధంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని, మంత్రి మేరుగ నాగార్జున అన్నట్లు సాయిబాబా ప్రకటన చేయడం శోచనీయమన్నారు. మండలస్థాయి కూడా లేని వ్యక్తి మంత్రిపై విమర్శించడం సరి కాదన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ మాచర్ల హేమసుందరరావు, వైస్ ఎంపీపీ కొత రపు పిచ్చయ్య శాస్త్రి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

బాపట్ల అర్బన్: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్), జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో విజేతలకు అభినందన సభ స్థానిక సరస్వతీ మెమోరియల్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.మనోజ్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి నిరంజన్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇటువంటి బహుముఖ కార్యక్రమాలను ఎస్ఎఫ్ఐ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య మాట్లాడుతూ సమాజంలో విద్యార్థులు కీలకపాత్ర పోషిస్తూ.. సామాజిక బాధ్యతతో చదువుకుంటూ ముందుకు సాగాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులు సాంస్కృతిక, కళా రంగాల్లో రాణించాలని కోరారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలని అన్నారు. మూఢ నమ్మకాల నిర్మూలనకు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా సేవలు అజరామరం

రేపల్లె: మదర్ థెరిస్సా సమాజానికి చేసిన సేవలు అజరామరమని తహసీల్దారు డి.మల్లికార్జునరావు అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శనివారం మదర్ థెరిస్సా జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. భారతదేశంలో పేదలకు, రోగులకు, అనాథలకు థెరిస్సా చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకుని నేటి యువత ముందుకు సాగాలన్నారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ సత్యనారాయణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

మథర్ థెరిస్సాకి నివాళులు

భట్టిప్రోలు: మథర్ థెరిస్సా 110వ జయంతిని శనివారం భట్టిప్రోలులో నిర్వహించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి మథర్ థెరిస్సా చిత్ర పటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. జెడ్పీటీసీ టి.ఉదయ భాస్కరి, వైస్ ఎంపీపీ కె.పిచ్చయ్య శాస్త్రి, మండల సమాఖ్య ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, పంచాయతీరాజ్ ఏఈ సేతు రామచంద్రరావు, ఈవోపీఆర్డీ టి.ఊహారాణి, మాజీ ఎంపీపీ మాచర్ల హేమ సుందరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎంపీ ఆర్థిక సాయం



పరమేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ మోపిదేవి

రేపల్లె రూరల్: వైఎస్సార్ సీపీని నమ్ముకున్న వారికి అన్ని వేళలా అండగా ఉంటానని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండలంలోని లంకెవానిదిబ్బ గ్రామానికి చెందిన కొప్పునాతి పరమేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. మృతుని కుటుంబాన్ని ఎంపీ మోపిదేవి శనివారం పరామర్శించి, రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. భవిష్యత్‌లోనూ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు, రాజుకాల్వ సర్పంచ్ తలశిల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు.

కనుల పండువగా బొడ్రాయి ప్రతిష్ఠ



కర్లపాలెం: మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో శనివారం బొడ్రాయి ప్రతిష్ఠ కనుల పండువగా జరిగింది. ఇందులో భాగంగా గ్రామంలో మూడు రోజుల నుంచి శాంతి హోమాలు, విశేష పూజలు నిర్వహిస్తున్నారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో శనివారం ఉదయం ప్రతిష్ఠా మహోత్సవం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్తులు బొడ్రాయిని దర్శించుకుని, పూజలు చేశారు.

వీవీఐటీలో నటుడు నవీన్ పొలిశెట్టి సందడి



పెదకాకాని: సినీ నటుడు నవీన్ పోలిశెట్టి వీవీఐటీ కళాశాలలో శనివారం సందడి చేశారు. అనుష్కా శెట్టి, నవీన్ పోలిశెట్టి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం మిస్‌శెట్టి.. మిస్టర్ పోలిశెట్టి. సెప్టెంబరు 7న సినిమా విడుదల కానున్న నేపథ్యం ప్రచారంలో భాగంగా నంబూరు వీవీఐటీ కళాశాలను శనివారం చిత్ర బృందం విచ్చేసింది. నవీన్ పోలిశెట్టి మాట్లాడుతూ కృష్ణాష్టమి రోజున సినిమా విడుదల కానున్నట్లు తెలిపారు. కొత్త కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని రూపొందించామని, ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్‌తో ఆద్యంతం అలరిస్తుందన్నారు. నవీన్ పోలిశెట్టితో విద్యార్థులు కలసి నృత్యాలు చేసి, సెల్ఫీలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

శివాలయంలో సహస్ర దీపాలంకరణ సేవ

పెదకాకాని: స్థానిక శివాలయంలో శ్రావణ మాసం పురస్కరించుకుని ఆలయ ప్రాకార మండపంలో రెండవ శుక్రవారం రాత్రి సహస్ర దీపాలంకరణ సేవ ప్రారంభించారు. భక్తులే స్వయంగా దీపాలు వెలిగించి, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వామివారి ఉత్సవమూర్తులకు ఊయల సేవ నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై అలంకరించి, ప్రదక్షిణలు చేపట్టారు.

గుర్రపుడెక్క తొలగింపు



పిట్టలవానిపాలెం: మండల పరిధిలోని ఆరెమండ్ల పంట కాలువలో తూటికాడ, గుర్రపుడెక్క తొలగింపు శనివారం చేపట్టారు. రైతులు ఇటీవల బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతికి సాగునీటి సరఫరా సమస్యలపై విన్నవించారు. జలవనరుల శాఖ అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే కాలువలో పేరుకుపోయిన తూటికాడ, గుర్రపు డెక్కలను తొలగించాలని ఆదేశించారు. తక్షణమే దిగి సంగుపాలెం, కోడూరు గ్రామాల పరిధిలో గల పంట కాలువలో తొలగింపు పనులు చేపట్టారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

మున్సిపల్ చైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్



అసిస్టెంట్ కమిషనర్ అనూషతో మాట్లాడుతున్న వైస్‌చైర్మన్ హరిప్రసాద్

తెనాలిఅర్బన్: వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ ఆదేశించారు. కొత్తపేటలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను శనివారం ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో మురుగు కాల్వలో పూడికతీత పనులు చేపట్టాలని సూచించారు. అలాగే వీధిలైట్లు కూడా ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలన్నారు. ఆమె వెంట వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ అసిస్టెంట్ కమిషనర్ అనూష, పలువురు ఇంజినీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు తప్పనిసరి



విద్యార్థినికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

కొల్లిపర: మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని మున్నంగి ఎస్సీ కాలనీలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ, డాక్టర్ వేముల ప్రియాంక వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం అమలవుతున్న తీరును పరిశీలించి తగు సలహాలు సూచనలు చేశారు. ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకాల వలన చిన్నారులకు వ్యాధులు వ్యాపించే అవకాశం తక్కువని, పోషకాహార విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం వలన చిన్నారులు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ బెజ్జం వందనం, ఏఎన్ఎం కూరపాటి మార్తమ్మ, అంగన్‌వాడీ టీచర్ కనపాల మధులత, ఆశా కార్యకర్తలు కుర్రా శివలీల, వనజ కుమారి, సుజాత పాల్గొన్నారు.

మున్నంగి హైస్కూలు విద్యార్థిని ప్రతిభ



బహుమతి అందుకుంటున్న సృజన

కొల్లిపర: తెలుగు భాషా వికాస వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో మండలంలోని మున్నంగి జెడ్పీ హైస్కూలు విద్యార్థిని కూచిపూడి సృజన ప్రతిభ కనబర్చింది. జానపద పాటల పోటీల్లో జిల్లా స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్యవరప్రసాద్, కేఎస్ లక్ష్మణరావుల చేతుల మీదుగా బహుమతి అందుకుంది. ఈ సందర్భంగా విద్యార్థినిని సంగీత ఉపాధ్యాయిని భువనేశ్వరి, డీవైఈవో నిర్మల, ఎంఈవో సాల్మన్‌రాజు, ప్రధానోపాధ్యాయుడు అప్పారావు అభినందించారు.

రెచ్చగొట్టే ప్రసంగాలపై చర్యలు తీసుకోవాలి

టీడీపీ నేతలపై వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ల ఫిర్యాదు



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్లు

చెరుకుపల్లి: ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో టీడీపీ నాయకులు ప్రజలను రెచ్చగొడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తు విద్వేషాలు సృష్టిస్తున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని రేపల్లె నియోజకవర్గ వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చన్నాయుడు, అయ్యన్నపాత్రుడు తదితర నాయకులు తెలుగుదేశం పార్టీ సభలలో కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టే విధంగా ప్రసంగిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్నదమ్ములుగా కలిసిమెలసి ఉంటున్న ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ అమాయక ప్రజలను వారి రాజకీయ అవసరాలకు వాడుకుంటూ దిగజారుడు రాజకీయాలు చేయటం దురదృష్టకరమన్నారు. రానున్న ఎన్నిల్లో ఓడిపోతామనే భయంతోనే టీడీపీ నాయకులు చిల్లర ప్రసంగాలు చేస్తున్నారని, వారిపై కేసు నమోదు చేసి, తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ఎస్సై వై.సురేష్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో రేపల్లె నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్లు బడుగు సుధాకర్, మామిళ్లపల్లి శివకోటేశ్వరరావు, అద్దెపల్లి మురళి, మండల కన్వీనర్లు ఈపూరి పాపారావు, మామిడి సుధీర్, అమర్తలూరి ఆనంద్, సిద్దార్థ ఉన్నారు.

మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధి ధ్యేయం



షాపును ప్రారంభించిన మత్స్యశాఖ సహాయ సంచాలకులు సైదా

యడ్లపల్లి(వేమూరు): మత్స్యకారుల ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు, సొంతంగా వ్యాపారం చేసుకోవడానికి మినీ ఫిష్ రిటైల్ అవుట్ లెట్ ఏర్పాటు చేయడం జరుగతుందని నిజాంపట్నం మత్స్యశాఖ సహాయ సంచాలకు బి.సైదా తెలిపారు. చుండూరు మండలంలోని యడ్లపల్లి గ్రామంలో ఆంధ్ర మినీ ఫిష్ రిటైల్ షాపును శనివారం ప్రారంభించారు. యూనిట్‌కు ఖరీదు రూ.3.25 లక్షలు అవుతుందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 40 శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్య కారులకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కూచిపూడి మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీలో ఇద్దరికి స్థానం



కూసంపూడి దేవేంద్రరాజు



షేక్ కరీమున్నీసా

పిట్టలవానిపాలెం: బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ కోశాధికారిగా ఖాజీపాలెం పార్టీ అధ్యక్షుడు కూసంపూడి దేవేంద్రరాజును, చందోలు ఎంపీటీసీ షేక్ కరీమున్నీసాను జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా నియమించారు. ఈ సందర్భంగా వారిద్దరు శనివారం స్పందించారు. తమ ఎన్నికకు సహకరించిన బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతికి, జిల్లా అధ్యక్షుడు, ఎంపీ మోపిదేవి వెంకటరమణారావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామని వారు తెలిపారు.

బంగారు ఆభరణాల చోరీ

పెదకాకాని: దొంగలు పడి 11 సవర్ల బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. లూథర్‌గిరి కాలనీకి చెందిన గేరా అమల భర్త చెన్నైలో బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో కుమారుడితో కలసి ఆమె పెదకాకానిలోని పుట్టింటిలోనే ఉంటోంది. ఎప్పటిలానే కింద పోర్షన్‌కు తాళాలు వేసి పై పోర్షన్‌లో వారు నిద్రించారు. ఈ నెల 25న పంచాయతీ కుళాయి ద్వారా నీళ్లు పట్టుకునేందుకు కిందకు దిగి చూడగా ఇంటి మెయిన్‌డోర్‌కు ఉన్న తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువా తాళం తీసి లాకర్ ఉన్న బంగారు గాజులు, బ్రాస్‌లెట్, గ్రీన్ కలర్ గోల్డ్ రింగ్, ప్లెయిన్ రింగ్‌లు, బుట్టలు, తీగల పోగులు, పోగులు, కమ్మలు, మంగళ సూత్రం మొత్తం 11 సవర్ల బంగారు ఆభరణాలు గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు గుర్తించారు. వాటి విలువ సుమారు రూ.1,20,000 ఉంటుందని పేర్కొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)
Office mail : sakshigntadvt@gmail.com